క్లుప్తంగా

ప్రాచీన కళలకు తెలంగాణ పుట్టినిల్లు

- హుజూరాబాద్ ఎమ్మెల్యే రాజేందర్

వీణవంక: ప్రాచీన కళలకు తెలంగాణ పుట్టినిల్లు అని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని కనపర్తి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న చిడతల రామాయణ పట్టాభిషేకం, ముగింపు సందర్భంగా ఈటల మాట్లాడారు. తెలంగాణలో ప్రాచీన కళలకు మంచి పట్టు ఉందన్నారు. కార్యక్రమంలో రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు సమ్మిరెడ్డి, బోళ్ల కొంరయ్య, నల్లగోని రమేశ్, రామచంద్రారెడ్డి, మాడ రాజురెడ్డి, రాజయ్య, పదాల సత్యనారాయణ, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కొండాల్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, సర్పంచ్ పర్లపల్లి రమేశ్ తదితరులు ఉన్నారు.

వెదురుగట్టలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి: మండలంలోని వెదురుగట్ట గ్రామంలో మాజీ సర్పంచ్ గుడిపాటి నర్సింహారెడ్డి స్మారక క్రికెట్ పోటీలను శనివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యం వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, మాచర్ల వినయ్‌కుమార్, బందారపు అజయ్‌కుమార్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్ రద్దు చేయాలి

వీణవంక: ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మడుగూరి సమ్మిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. ధరణితో సీఎం కేసీఆర్ కుటుంబానికి మాత్రమే లబ్ధి చేకూరుతుందని సామాన్యులు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే రుణమాఫీ చేయాలన్నారు. రైతులను అరిగోస పెడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని, రైతులకు 24గంటల కరెంట్ ఇస్తామని పగటిపూట నిరంతరంగా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని అన్నారు.

ఆర్థికసాయం అందజేత

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లిలో ఇటీవల మృతి చెందిన మత్స్యకార్మికుడు నెల్లి రాములు కుటుంబానికి వెన్నంపల్లి మత్స్యకార్మిక సహకార సంఘం అధ్యక్షుడు పెసరు కుమారస్వామి రూ. ఐదువేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నెల్లి శ్రీనివాస్, కార్యదర్శి కొమురయ్య, కోశాధికారి తిరుపతి, సభ్యులు వీరేశం, ఐలయ్య, చంద్రయ్య, రాజయ్య, భిక్షపతి, సమ్మయ్య ఉన్నారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలో శనివారం రెండో విడత కంటి వెలుగులో భాగంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు చేశారు. అనంతరం హెల్త్ అసిస్టెంట్ శ్రీరాములు శ్రీనివాస్ కళ్లద్దాలను అందజేశారు. మొత్తం 300 మందికి పరీక్షలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్‌రెడ్డి, ఏఎన్‌ఎం మంజుల, ఆశా కార్యకర్తలు శ్యామల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై తోట తిరుపతి

ఇల్లందకుంట: నెహ్రూ యువకేంద్రం కరీంనగర్, శివరుద్ర యువజన సంక్షేమ సంఘం, మండలంలోని శ్రీరాములపల్లి యువజన సంఘం అధ్యక్షుడు గుత్తికొండ పవన్ ఆధ్వర్యంలో శనివారం జలశక్తి అభియాన్ వాల్‌పోస్టర్‌ను ఎస్సై తోట తిరుపతి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవాళికి నీరు వరం, వృథా చేయకుండా రాబోయే తరాలకు సమృద్ధిగా నీరు అందేలా వర్షపు నీటిని నిల్వ చేయాలన్నారు. వర్షాకాలంలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ మల్లేశం, యువజన సంఘం సభ్యులు రుద్రవరపు చంద్రశేఖర్, విఘ్నేష్, ఈశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూల్.. కూల్‌గా

- సామాన్యులకుఅందుబాటులో వెరైటీ కూలర్లు
- వేసవి ప్రారంభంలోనే మొదలైన కొనుగోళ్లు
- ఆసక్తి చూపుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు

సండే స్పెషల్



గది లోపల ఉపయోగించే కూలర్



అమ్మకానికి సిద్ధంగా వివిధ రకాల కూలర్లు

జమ్మికుంట: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఇంటికి కావాల్సిన సౌకర్యాలను సమకుర్చుకుంటున్నారు. వేసవి ప్రారంభంలోనే ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఇళ్లలోకి సరిపోయే కూలర్స్ కొనగోలు చేస్తున్నారు. సామాన్యుడి ఏసీ(ఎయిర్‌కండీషనర్)గా పిలువబడే వెరైటీ కూలర్స్ అప్పుడే మార్కెట్‌లోకి వచ్చేశాయి. అందరికి అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నాయి. ఇంటిలోని గదులకు సరిపోయేలా వివిధ సైజ్‌ల్లో అందుబాటులో ఉన్నాయి. దీంతో వేసవిని కూల్.. కూల్‌గా గడిపేందుకు ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం కూలర్లు రూ. మూడువేల నుంచి రూ. ఆరువేల వరకు లభ్యమవుతున్నాయి. రిపేర్ లేకుండా రెండు నుంచి మూడు సంవత్సరాలు కూలర్స్‌ను వినియోగిస్తున్నారు.

పెళ్లి, శుభకార్యాలకు గిఫ్ట్‌లుగా

ప్రస్తుతం పెళ్లిళ్లు, శుభకార్యాలకు గిఫ్టులుగా కూలర్స్ ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. బ్రాండెడ్ కంపెనీల కూలర్స్ రూ. ఆరువేల నుంచి పదహారు వేల వరకు లభ్యమవుతున్నాయి. సింపనీ, కేనీస్టార్, క్రామ్‌ప్టెన్,ఉషా, వీగార్డు, తదితర కంపెనీలవి సౌకర్యంగా ఉంటున్నాయని వినియోగదారులు తెలుపుతున్నారు.

సామాన్యుడికి అందుబాటులో 'నాగపూర్'కూలర్స్

కూలర్స్ సైజును బట్టి మూడువేల నుంచి ఆరు వేల వరకు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయి. రోజూ నీరుపోస్తే సుమారు ఐదు నుంచి ఆరుగంటల వరకు చల్లదనం, కరెంట్ బిల్లు సైతం తక్కువగా వస్తుందని, రిపేర్ సౌకర్యంగా ఉంటుందని ప్రజలు నాగపూర్ కూలర్స్ కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.

వ్యాపార దుకాణాల్లో అసెంబుల్డ్ కూలర్ల అమ్మకాలు అధికం

చిన్న వ్యాపార సముదాయాలు, చిన్న గదిల్లో నాగపూర్, అసంబుల్డ్ (లోకల్ తయారీ) కూలర్స్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. చిన్నవి రెండు వేల నుంచి లభ్యమవుతున్నాయి. వేసవిలో కిరాణ, బట్టల షాపు, పాన్‌షాపు, హోటల్స్, మెడికల్ షాపుల్లో సైతం అసంబుల్డ్ కూలర్స్ వాడుతుంటారు.

కూలర్స్ రకాలు, ధరలు

లోకల్ కూలర్ రూ.మూడు నుంచి ఆరువేలు
(నాగపూర్, అసంబుల్డ్)
బ్రాండెడ్ కూలర్స్ రూ. ఆరు నుంచి పదహారువేలు
కూలర్ల సైజ్‌ను బట్టి
రూ. రెండు వేల నుంచి లభ్యం

తక్కువ ధరలో లభ్యం



ఎండాకాలంలో వ్యవసాయ పనులకు వెళ్తుంటాం. మాది రేకుల ఇల్లు, వేసవిలో ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది, పని చేసి అలిసిపోతాం. చల్లగా వేసవి నుంచి ఉపశమనం పొందడానికి జమ్మికుంట పట్టణంలో అన్ని రకాల కూలర్స్ పరిశీలించి తక్కువ ధరలో కూలర్‌ను కూలర్ కొనుగోలు చేశాను.

– గిరవేన శ్రీను, తార్‌పెల్లి, కాల్వశ్రీరాంపూర్

లోకల్ కూలర్స్ అమ్మకాలు ఎక్కువ



గతేడాది ఫిబ్రవరిలో కూలర్స్ కొనగోళ్లు ప్రారంభం కాగా ఈ సంవత్సరం మార్చిలో కొనుగోళ్లు మొదలయ్యాయి. పేద ,మధ్య తరగతివారు లోకల్ కూలర్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఎక్కువగా లోకల్ కూలర్స్ అమ్ముడవుతాయి.

– శ్రీకాంత్, హోమ్‌నీడ్స్, ఎలక్ట్రానిక్స్, యజమాని

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం





చొప్పదండి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు, మానకొండూర్‌లో..

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శనివారం కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమర్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆందోళనలు నిర్వహించారు. బాధ్యతగల హోదాలో ఉండి మహిళ పట్ల కనీస గౌరవం లేకుండా, సభ్యసమాజం తలదించుకునేలా అసభ్యకరంగా మాట్లాడారని విమర్శించారు. బండి సంజయ్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్షాలను భయపెట్టిస్తుందని, ప్రజలు బీజేపీకి త్వరలో గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. మహిళా ప్రతినిధిపై బీజేపీ నాయకులు అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు.



తిమ్మాపూర్: ఫిర్యాదు చేస్తున్న నాయకులు

– సాక్షి నెట్‌వర్క్

పొదుపుతోనే ఆర్థిక అభివృద్ధి



శంకరపట్నం: మాట్లాడుతున్న నరహరి రాజిరెడ్డి

శంకరపట్నం: పొదుపుతోనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతామని మండలంలోని తాడికల్ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు నరహరి రాజిరెడ్డి అన్నారు. శనివారం సంఘం పదో వార్షిక సమావేశం సంఘం ఆదాయ, ఖర్చుల వివరాలపై చర్చించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరహరి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పూదరి మొగిలయ్య, సభ్యులుగా చంద్రమౌళి, మొగిలయ్య, కుమార్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నామని సమితి అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు.

మహాసభను విజయవంతం చేయాలి

హుజూరాబాద్: పట్టణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం స్వామి వివేకానంద పురుషుల పొదుపు సంఘం సమావేశం నిర్వహించనున్నామని సంఘం పర్యవేక్షకుడు చిట్టంపెల్లి ఉపేందర్‌రావు శనివారం తెలిపారు. మహాసభ సమావేశంలో సంఘం అభివృద్ధి, పలు అంశాలపై చర్చించనున్నామని, సభ్యులంతా సకాలంలో హాజరై సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

చిత్ర కథ: మొక్కజొన్న పంటకు రక్షణగా...



యాసంగి సీజన్‌లో సాగు చేసిన ఆరుతడి పంటలను కోతులు, పక్షుల నుంచి కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో మెండె గంగయ్య అనే రైతు మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. కంకులను కోతులు, పిట్టలు తినకుండా ఉండేందుకు పంట చుట్టూ చీరలను రక్షణగా కట్టారు. అంతేకాకుండా కోతులు రాకుండా ఉండేందుకు బాంబులను సైతం కాల్చుతున్నట్లు రైతు గంగయ్య తెలిపారు.

– కరీంనగర్‌రూరల్

నేడు మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



సమావేశమైన కమిటీ సభ్యులు

హుజూరాబాద్: మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం సమావేశమయ్యారు. జ్యోతిరావుపూలే, డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబుజగ్జీవన్‌రాం నూతన జయంతి ఉత్సవ కమిటీని 12న పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. కమిటీ ఎన్నికకు బీసీ,ఎస్సీ ఎస్టీ,మైనారిటీ, ప్రజాస్వామిక వాదులు, మేధావులు,ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో జ్యోతిరావుపూలే కమిటీ చైర్మన్ కొలిపాక సమ్మయ్య, అంబేడ్కర్ జయంత్యుత్సవ కమిటీ చైర్మన్ బొరగాల సారయ్య, ప్రధాన కార్యదర్శి ఖాలిద్ హుస్సేన్, బాబు జగ్జీవన్‌రాం కమిటీ చైర్మన్ బత్తుల రాజలింగం, సమన్వయకర్తలు వేల్పుల రత్నం, డాక్టర్ తడిక మల్ల శేఖర్, పొడిశెట్టి వెంకటరాజం, బొడ్డు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



మందులు అందిస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ

జమ్మికుంట: మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ, విజయ డెయిరీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వివిధరకాల వైద్య పరీక్షలు చేసి టీకాలు, నట్టల నివారణ తదితర మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇల్లందుల అన్నపూర్ణ, ఉపసర్పంచ్ గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యాధికారి ప్లవన్ ముజుందర్, బీఎంసీయూ ఇన్‌చార్జి సతీష్, గోపాల మిత్ర సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో ఆధార్ అప్‌డేట్ క్యాంపు



గన్నేరువరం: మండల కేంద్రంలో శనివారం ఆధార్ అప్డేట్ క్యాంపు ప్రారంభమైంది. ఆధార్ కార్డు పొంది పదేళ్లు గడిచిన వారు అప్‌డేట్ చేసుకోవాలని అక్షర మీసేవా నిర్వాహకులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలతో పాటు బ్యాంకు ప్రయోజనాలు, సబ్సిడీ పథకాలకు ఆధార్ ముఖ్యమని, ఒరిజనల్ ఓటర్ ఐడీ, బ్యాంకు పాసు బుక్, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధిహామీ జాబ్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ ఏదైనా వెంట తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పుల్లెల లక్ష్మణ్, మీసేవావ నిర్వాహకుడు తెల్ల రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గుండి గ్రామంలో శనివారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, రాష్ట్రానికి వస్తున్న ఆదరణ ఓర్వలేక కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ మానస, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, రాజేశం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, ప్రవీణ్ పలువురు పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



చెక్కులు అందిస్తున్న చైర్మన్ వెంకట్‌రమణారెడ్డి

చిగురుమామిడి: సహకార సంఘం ద్వారా తీసుకున్న రుణాలతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకట్‌రమణారెడ్డి కోరారు. శనివారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో పలువురు రైతులకు రూ. 50 లక్షల చెక్కులు అందించారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ ద్వారా జీవనోపాధి పొందాలని, తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం పురోగతికి సహకరించాలన్నారు. అనంతరం సంఘం ఆదాయం, వ్యయాలపై చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో సింగిల్ విండో వైస్‌చైర్మన్ మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్, తిరుపతి, పోతరవేని శ్రీనివాస్, బండి లక్ష్మి, పేరాల లక్ష్మి, అందె స్వామి, రవీందర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, సీఈఓ కాటం నర్సయ్య పలువురు పాల్గొన్నారు.

రేపు చైతన్య సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మాలల రాజకీయ చైతన్య సదస్సు వాల్ పోస్టర్‌ను బీఎస్పీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు బండారి సదానందం మాట్లాడుతూ.. 13న జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు కానున్నారని తెలిపారు. సదస్సుకు మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మొగులయ్య, జిల్లా మహిళా కో కన్వీనర్ కవ్వంపల్లి లలిత, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మంద సమ్మయ్య, జమ్మికుంట మండల కన్వీనర్ ఈదున్నూరి రమేశ్, మండల కన్వీనర్ రామ్ శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు గరవేణి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి గుర్తింపు



సన్మానిస్తున్న జెడ్పీటీసీ రవీందర్

చిగురుమామిడి: బీఆర్ఎస్‌లో కష్టపడి పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. శనివారం హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ రామోజు రజితకృష్ణమాచారి, డైరెక్టర్ కొత్త కైలాసంను చిగురుమామిడిలో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సన్మాన కార్యక్రమంలో చిగురుమామిడి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కృష్ణమాచారి, ఎస్సీ సెల్ మండలశాఖ అధ్యక్షుడు అంజయ్య, సుందరగిరి దేవస్థానం చైర్మన్ సంపత్‌కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్ తిరుపతి, దేవస్థానం డైరెక్టర్ రాజ్‌కుమార్, దిలీప్‌కుమార్, విష్ణుమాచారి, నాయకులు అరుణ, రాజయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం సంక్షేమ పథకాలు



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గన్నేరువరం: ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తోనే గన్నేరువరం మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో మాట్లాడారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. మండలంలో గృహలక్ష్మి, దళితబంధు లబ్ధిదారులు ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, మానకొండూర్ నియోజకవర్గానికి రెండువందల కోట్లు కేటాయించడం హర్షనీయమన్నారు. లబ్ధిదారుల ఎంపిక త్వరలో ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం అగ్రతాంబూలం

తిమ్మాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధికి అగ్రతాంబూలం ఇస్తుందని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా నియోజకవర్గంలోని సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి భారీగా తరలివచ్చారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని వీఆర్‌ఆర్‌నగర్‌కు చెందిన పి.రాజయ్య ఇంటిలో శనివారం జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో పాక్షికంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రాజయ్య ఇంటిలోని ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా ఇంట్లో మంటలు లేవడంతో వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి ప్రాణనష్టం జరుగకుండా కాపాడినట్లు ఫైర్ ఆఫీసర్ వెంకన్న తెలిపారు.

'మేయర్ విమర్శలు అర్థరహితం'

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ, నాయకులపై మేయర్ సునీల్‌రావు వ్యాఖ్యలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ నాయకులు మేనేని రోహిత్‌రావు అన్నారు. శనివారం కార్యాలయంలో మాట్లాడారు. గతంలో ఏ పార్టీలో ఉండి పదవులు పొందారో గుర్తు చేసుకోవాలన్నారు. కార్పొరేటర్, మార్కెట్ కమిటీ చైర్మన్, యువజన కాంగ్రెస్‌లో పలు బాధ్యతలు నిర్వహించి నేడు కాంగ్రెస్‌ను విమర్శించడం భావ్యం కాదన్నారు. ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని తెలిపారు.